క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరణ



రమేశ్



చేరాలు

రామడుగు: రామడుగు మండలం ఎస్సైగా రమేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన తోట తిరుపతి జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లారు. దీంతో కరీంనగర్-2 టౌన్‌లో పని చేస్తున్న రమేశ్ రామడుగు ఎస్సైగా అధికారులు బదిలీ చేశారు.

ఎల్ఎండీ ఎస్సైగా ..

తిమ్మాపూర్: ఎల్ఎండీ ఎస్సైగా బెల్లం చేరాలు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ ఎస్బీ నుంచి ఎల్ఎండీకి బదిలీపై వచ్చారు. గతంలో కరీంనగర్ ట్రాఫిక్, చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. మండలంలో ఎలాంటి సమస్యలున్నా ఫిర్యాదుదారులు తనను సంప్రదించాలని సూచించారు. లా అండ్ ఆర్డర్‌ను ఎవరు ఉల్లంఘించిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సర్కిల్ ఇన్‌చార్జి సీఐ రాజకుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలి

రామడుగు: మండలంలోని వెదిర స్టేజీ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులకు స్టాప్ ఉన్నప్పటికీ డ్రైవర్లు ఆపడంలేదని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి డిపోలకు చెందిన బస్సుల్లో విద్యార్థులు, పలువురు ఎక్కినా దింపేస్తున్నారని, దిక్కున్న చోట చెప్పుకోమ్మని ఇబ్బందికరంగా మాట్లాడుతున్నారని వెదిర గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్టాప్ ఉన్నప్పటికీ బస్సులు ఆపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, బస్సులు ఆగేలా ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన నాయకులు



మన్‌కీ బాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్ ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు వీక్షించారు. ఈసందర్భంగా అయోధ్య రామమందిరం విశేషాలు సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా ప్రయాస్‌పై మాట్లాడారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అప్పం మధు, ప్రవీణ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయాల కోసం అవిశ్వాస తీర్మానాలు



శంకర్

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ పదవిపై కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టడం స్వార్థ రాజకీయాల కోసమేనని సీపీఎం పట్టణశాఖ కార్యదర్శి కొప్పుల శంకర్ ఆరోపించారు. మున్సిపల్‌లో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై ఆదివారం స్పందించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన కౌన్సిలర్లు నాలుగేళ్లుగా అధికారం అనుభవించారని, అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో పార్టీ మారేందుకు అవిశ్వాసం ఓ అవకాశంగా తీసుకొంటున్నారని, పట్టణ సమస్యలు పరిష్కరించకుండా అధికారం, సంపాదన లేకపోతే పైరవీలు, పనులు జరగవని, నిధులు రావని ఆత్మరక్షణకు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. స్వార్థ రాజకీయాలను అవలంబించే కౌన్సిలర్లకు ప్రజలు పుట్టగతులు లేకుండా చేయాలని పార్టీ పక్షాన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రైతులకు అవగాహన కల్పించిన విద్యార్థులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

జమ్మికుంట: మండలంలోని తనుగుల గ్రామంలో హైదరాబాద్‌లోని మల్లారెడ్డి అగ్రికల్చర్ విద్యార్థులు పొలంలో పంటలపై రసాయన మందులు చల్లే క్రమంలో రైతులు వినియోగించే స్ప్రెయింగ్ కిట్స్‌పై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు కిట్స్ చూపించారు. రసాయనాలు శరీరం మీద పడితే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని కిట్స్ వాడకం రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం నెగ్గేనా..? వీగేనా..?

- బల్దియా చైర్మన్ అవిశ్వాసంపై ఉత్కంఠ..!
- జమ్మికుంటలో హీటెక్కిన రాజకీయం
- రాష్ట్ర ప్రభుత్వం మార్పుతో ముసలం
- పావులు కదుపుతున్న వైనం
- కాంగ్రెస్‌లో చేరి ఎన్నికల్లో పోటీకి కౌన్సిలర్ల ముందస్తు వ్యూహం..?



అవిశ్వాస పత్రమిస్తున్న పొనగంటి వర్గం కౌన్సిలర్లు



వినతిపత్రమిస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్, కౌన్సిలర్లు

జమ్మికుంట: జమ్మికుంట బల్దియా చైర్మన్‌పై అవిశ్వాసం ఉత్కంఠ రేపుతోంది. నాలుగేళ్లుగా సాఫీగా సాగిన మున్సిపల్‌లో రాష్ట్ర ప్రభుత్వ మార్పుతో పాలిట్రిక్స్ ఒక్కసారిగా హీటెక్కాయి. అందుకు అనుగుణంగా ప్రస్తుత చైర్మన్, కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరాలనే తలంపుతో ఉన్నారని తెలిసింది. దీంతో చైర్మన్ వ్యతిరేక వర్గం సభ్యులు పావులు కదిపారు. చైర్మన్‌తోపాటు పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లోకి వెళ్లాలని నిర్ణయించుకొని అవిశ్వాసానికి తెరలేపారని పట్టణంలో చర్చ జరుగుతోంది.

యూటర్న్ తీసుకున్న కౌన్సిలర్లు..!

బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి గెలుస్తుందనకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో రాజేశ్వర్‌రావు వ్యతిరేక వర్గం ఒక్కసారిగా యూటర్న్ తీసుకన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య కాంగ్రెస్‌లో చేరారు. ఆ కౌన్సిలర్ 23వ కౌన్సిలర్‌తో జతకట్టారు. ప్రభుత్వంలోని రాజకీయ పెద్దల సహకారంతో చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావుపై అవిశ్వాసానికి పావులు కదిపారు. పొనగంటి మల్లయ్య సారథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో పవన్‌కుమార్‌కు 20మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన పత్రాన్ని శుక్రవారం అందజేశారు. కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో చైర్మన్ రాజేశ్వర్‌రావు చేసిన బుజ్జగింపుల పర్వం, వాగ్వాదంతో ఒక్కసారిగా తెరుకొని పోలీసుల బందోబస్తుతో క్యాంపు రాజకీయాలకు శ్రీకారం చుట్టారు. ఇదిలా ఉండగా 24 గంటలు గడవక ముందే బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శనివారం ఇచ్చిన తీర్మానానికి వ్యతిరేకంగా చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్‌చైర్‌పర్సన్ దేశిని స్వప్నతో సహా 21 మంది సంతకాలతో కూడిన తీర్మాన పత్రాన్ని ఏకంగా కలెక్టర్‌కు నేరుగా అందజేశారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడాన్ని తప్పుపడుతూ కౌన్సిలర్ గుర్తింపు రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అయితే చైర్మన్ పీఠంపై అవిశ్వాసం నల్లేరు మీద నడకేనని భావించినప్పటికీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్న వర్గానికి 21 మంది మద్దతు పలకడం పట్ల జమ్మికుంటలో పవర్ పాలిట్రిక్స్ హీటెక్కాయి.

కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకే ముందస్తు రాజకీయం

రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. అందుకు అనుగుణంగా బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్, వైస్‌చైర్‌పర్సన్, కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరి పదవులు, పనులు చేసుకునేందుకు జిల్లా మంత్రులతో కలిసి మంతనాలు చేసినట్లు పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. దీంతో చైర్మన్ వ్యతిరేక వర్గం వెంటనే తెరుకొని వారిని కాంగ్రెస్ ప్రభుత్వంలోకి రాకుండా అడ్డుకోవాలని నిర్ణయించుకున్నారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ పీఠంపై ప్రభుత్వం పెద్దల అండదండలతో కాంగ్రెస్ పొనగంటి మల్లయ్యతో సారథ్యంలో కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టి కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయం తీసుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ కౌన్సిలర్లుగా పోటీ చేసి గెలవాలనే ఉద్దేశంతో రాజకీయ వ్యూహాలకు పదను పెట్టారని తెలుస్తోంది. అందుకు పొనగంటి మల్లయ్య నజరానాలు అందించేందుకు ముందుకు రావడం, అవిశ్వాసం పెట్టడం, క్యాపు రాజకీయాలు జరిగాయని పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

పోటాపోటీగా క్యాంపులు..

జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయారు. దీంతో పోటాపోటీ క్యాంపు రాజకీయాలు నడుస్తున్నాయి. పొనగంటి మల్లయ్య క్యాంపులో 16 మంది ఉన్నాట్లు సమాచారం. చైర్మన్ రాజేశ్వర్‌రావు 23 మంది నావెంటే ఉన్నారనే ధీమా వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారులకు తలనొప్పిగా..

20 మంది మద్దతు కౌన్సిలర్లు ఒక వర్గానికి ఉన్నారని చెపుతుండగా మరో వర్గానికి 23 మంది మద్దతు ఉందని, ఉన్నతాధికారులకు అవిశ్వాసం, వినతి పత్రాలను పోటాపోటీగా అందజేయడంతో రాజకీయ పరిణామాలు ఆసక్తి రేకిస్తున్నాయి. ఇరు వర్గాల విషయం ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారనుంది. మరోవైపు క్యాంపులోని కొందరు కౌన్సిల్ సభ్యులు చైర్మన్ రాజేశ్వర్‌రావుతో మంతనాలు జరుపుతున్నారని సమాచారం. దీంతో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై నెలకొన్న అవిశ్వాసం నెగ్గుతుందా..? వీగుతుందా..? అనే ఉత్కంఠ కొనసాగుతోంది.

1/3 సభ్యుల ఆమోదం తప్పనిసరి..?

మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వానికి 1/3 సభ్యుల ఆమోదం తప్పనిసరి. కానీ పొనగంటి మల్లయ్య ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానం 20 సభ్యులు సంతాకాలు చేసినట్లు, వద్దని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్‌కు మద్దతుగా 23 మంది కౌన్సిల్ సభ్యులు ఉన్నట్లు తీర్మాన పత్రాల్లో ఉంది. కానీ 30 మంది వార్డు సభ్యుల్లో అవిశ్వాసంపై 21 మంది సభ్యుల తీర్మానం ఉండాలని అప్పుడు అవిశ్వాసం నెగ్గుతుందని కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం సాయంత్రం ఇరువర్గాలకు మెసేజ్ రూపంలో వర్తమానం పంపినట్లు సమాచారం. అవిశ్వాసం పెట్టిన కౌన్సిల్ సభ్యులు నైరాశ్యంలో ఉన్నారని తెలుస్తోంది. అవిశ్వాసంపై పవర్ పాలిట్రిక్స్ ఎటువైపు తిరుగుతాయో వేచి చూడాలి.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం



నివాళి అర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మిట్టపెల్లి రాయమల్లు శనివారం మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. ఆదివారం రాయమల్లు మృతదేహానికి నివాళి అర్పించారు. ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, బొమ్మనపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు మాచమల్ల రమణయ్య, నాయకులు మాచమల్ల కిషోర్, యాంసాని కనుకవ్వ, మడమడకల రాజు, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు మిట్టపెల్లి ఆదర్శ్ తదితరులున్నారు.

ఆర్థిక సాయం అందజేత

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ జితేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి చిత్రపటానికి ఆర్ఎంపీలు ఆదివారం నివాళి అర్పించారు. అనంతరం జితేందర్ కుటుంబానికి రూ.35 వేలు అందించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీల సంఘం మండల అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, నరసింహరాజు, కంకనాల ప్రభాకర్‌రెడ్డి, సమ్మయ్య, శీను, రాజు, రాజయ్య తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న ప్రణవి

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ పరిధి ఇందిరానగర్ 12వ వార్డుకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎం. ప్రణవి రిలయన్స్ ఫౌండేషన్ సంస్థ ఇటీవల ముంబాయిలో నిర్వహించిన జాతీయస్థాయి వ్యాసరచన పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి సాధించినట్లు ఆమె తండ్రి మండల గోపి ఆదివారం తెలిపారు. మై ఇండియా మై ల్యాండ్ ఆఫ్ డైవర్సిటీ అండ్ కల్చర్ అనే అంశంపై పోటీలు నిర్వహించారని, రెండు రోజుల క్రితం అతిథిలు రిలయన్స్ ఇండస్ట్రియల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముఖేష్ డి అంబానీ, ఫౌండర్ అండ్ చైర్ పర్సన్ నీతా ఎం అంబానీ, సంస్థ డైరెక్టర్ ఇషా అంబానీ పిరమల్ చేతులు మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నట్లు వివరించారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి హుజురాబాద్ పేరును జాతీయస్థాయిలో నిలిపిన ప్రణవిని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ తొగరు సదానందం హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

క్రీడా వార్తలు

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన జమ్మికుంట వాసులు



పతకాలు అందుకున్న ప్రభాకర్, అశోక్

జమ్మికుంట: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించిన నేషనల్ అథ్లెటిక్స్‌లో 45 సంవత్సరాల విభాగంలో జమ్మికుంటకు చెందిన ఇద్దరు సత్తా చాటారు. మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్(ప్రభు)డిస్కస్‌త్రోలో (ప్రథమస్థానం) బంగారు పతకం, హైమర్‌త్రోలో (తృతీయ స్థానం) కాంస్య పతకాలు సాధించగా మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటకు చెందిన ఎగిత అశోక్ హైమర్‌త్రోలో (ద్వితీయస్థానం) వెండి, షాట్‌పుట్‌లో (తృతీయ స్థానం) కాంస్య పతకాలు సాధించారు. మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ తెలంగాణ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి రామారావు చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. ఫిబ్రవరి 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మెగా పోటీలకు వీఎస్సార్ కాలేజీ విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిఖిల్ రెడ్డి, రాహుల్ రాష్ట్రస్థాయి మెగా క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ హనుమకుమార్, ఫిజికల్ డైరెక్టర్ సిద్ధమల్ల విజయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు గజ్వేల్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

శ్రీరాముడి అక్షింతల శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట గ్రామంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతల శోభాయాత్ర ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అయోధ్య నుంచి తీసుకొచ్చిన రాములోరి అక్షింతలను గ్రామంలోని దేవాలయం నుంచి ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, శ్రీరామాలయ కమిటీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



జమ్మికుంట: ప్రైవేట్ యూనివర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేయడం పట్ల పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునే అవకాశం ఉందని, ఎందరికో మేలు జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అశోక్, విజయరావు, నవీన్, రవీందర్, సుమన్, మల్లయ్య, సాగర్, అఖిల్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పచ్చునూర్‌ను అభివృద్ధి చేస్తా



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్‌రూరల్: పచ్చునూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక మొదటిసారి సొంత గ్రామం పచ్చునూర్‌లో ఆదివారం పర్యటించారు. గ్రామస్తులు, మహిళలు పెద్దసంఖ్యలో హాజరై స్వాగతం పలికారు. గ్రామంలోని అంబేడ్కర్ గ్రహానికి పూల మాల వేసిన అనంతరం పెద్దమ్మగుడిలో పూజలు చేశారు. గ్రామస్తుల సమక్షంలో కేక్‌కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ప్రజలందరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు తీరుస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానంలో యువసేన సభ్యులు

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో తుమ్మనపల్లి శ్రీనివాసరావు యువసేన ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు నిరుపేదలకు చేసిన సేవలు మరువలేనివని యువసేన సభ్యుడు గుంటి మధుకర్ అన్నారు. యువసేన ఆధ్వర్యంలో మండలంలో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పొట్ట శ్రీనివాస్, గొల్ల గణేశ్, శానగొండ కమలాకర్, అసోద సురేశ్, అజయ్, రాజు, నిసార్, సాగర్, అనిల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాల్లో రైతుబంధు జమ చేయాలి

హుజూరాబాద్: రైతుబంధు అందక రైతులు అప్పులపాలవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని జిల్లా ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు గ్రహీత నలుబాల వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ సాయం అందక యాసంగి పనులు ప్రారంభించిన రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే ప్రజా పాలనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అర్హులకు ఆరు గ్యారెంటీలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పార్కింగ్ ఇలా.. పోయేదెలా..?



సైదాపూర్: ఏళ్లుగా మండల కేంద్రం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ప్రధాన రోడ్లు విస్తరణకు నోచుకోవడంలేదు. ఎదురెదురుగా వాహనాలు వస్తే అంతే పరిస్థితి. మండల కేంద్రంలో ముల్కనూర్ నుంచి వయా సైదాపూర్ టూ మొలంగూర్ రోడ్డు, హుజూరాబాద్ నుంచి వయా హుస్నాబాద్ ప్రధాన రహదారులున్నాయి. ఈ రోడ్లు ఇరుకుగా ఉంటే మరోవైపు రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. కొత్త బస్టాండ్ ఏరియాలో బ్యాంకు సముదాయం, హోటల్ ఎదుట వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. బస్టాండ్ నుంచి బస్సు బయటికెళ్లడం కష్టమవుతోంది. పాత బస్టాండ్ ఏరియాలో ప్రధాన రోడ్డు పక్కన ఉన్న టీ పాయింట్లు, వైన్‌షాపుల ఎదుట వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు అవస్థలు



హుజూరాబాద్‌లోని మీ సేవా కేంద్రం వద్ద జనం

హుజూరాబాద్‌రూరల్: ప్రజాపాలన గ్రామ సభల్లో దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టగా ఆధార్ అప్‌డేట్ కోసం లబ్ధిదారులు మీ సేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ప్రతీ కేంద్రంలో రోజుకు 40 ఆధార్ కార్డుల అప్‌డేట్‌కు ఆస్కారం ఉండటంతో ఉదయం నుంచే కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారు. గ్రామసభల్లో దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్న సమయంలో రేషన్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకుంటున్న క్రమంలోనే ఆధార్ కార్డు వివరాలు సరిగ్గా ఉండాలంటూ సంబంధిత లబ్ధిదారులు ఆధార్ అప్‌డేట్ కోసం ఆరాటపడుతున్నారు.

నిరంతర ప్రక్రియ..

ఆధార్ అప్‌డేట్ అనేది నిరంతర ప్రక్రియ అనే విషయం తెలియక గడువు ముగుస్తుందంటూ కొందరు మీ సేవ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం అందించే పథకాలకు ప్రస్తుతమున్న ఆధార్, రేషన్ కార్డులు అర్హతగా చలామణి అవుతున్నాయి. పదేళ్ల ఆధార్‌లో మార్పులు చేయనివాళ్లు అప్‌డేట్ చేయించుకుంటున్నారు. కానీ తప్పనిసరి కాదనే విషయాన్ని గ్రహించాలని అధికారులు సూచిస్తున్నారు. సవరణలు ఉంటే తప్ప ఆధార్‌ను అప్‌డేట్ చేయాల్సిన అవసరం లేదని చెబుతున్నారు.

అదనపు వసూలు

అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ఆధార్ అప్‌డేట్‌కు కొందరు మీ సేవ కేంద్రాల నిర్వాహకులు రూ. 100 వసూలు చేస్తున్నారు. అప్‌డేట్ కోసం రూ. 50 మాత్రమే చార్జి తీసుకోవాలనే ఆదేశాలున్న బేఖాతరు చేస్తుండటం గమనార్హం.

అధిక చార్జీ అడుగుతున్నారు



ఆధార్ కార్డులో ఇంటి పేరులో తప్పిదాలు, పుట్టిన తేదీలో మార్పు చేసుకుందామని మీ సేవ కేంద్రానికి వెళ్తే ప్రభుత్వం విధించిన చార్జీల కంటే అధికంగా అడుగుతున్నారు. ఇదేమిటని సరైన సమాధానం ఇవ్వటం లేదు. అధికారులు దృష్టి సారించాలి.

– సంధ్య, ప్రైవేట్ స్కూల్ టీచర్, హుజూరాబాద్

క్యాలెండర్ ఆవిష్కరణ

విద్యానగర్(కరీంనగర్): 2024 సంవత్సరం సందర్భంగా విశ్వబ్రాహ్మణ అఫిషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఆదివారం కరీంనగర్‌లోని శ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మం గారి దేవాలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు.